ఫ్యామిలీ కౌన్సెలింగ్

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# నా గురించి నీచంగా మాట్లాడాడు!

నాకు రెండేళ్ళ క్రితం పెళ్లయింది. నా భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నేను కూడా ఉద్యోగం చేసేదాన్ని. పెళ్లి కోసం మానేశాను. కానీ, పెళ్లయిన రెండోరోజే ఆయన నాలోని లోపాలు ఎత్తిచూపడం ప్రారంభించాడు. నేను, నా చదువు, నా స్వభావం, నా ఉద్యోగం, నా కుటుంబం... ఏవీ నచ్చలేదనీ, ఇష్టం లేని పెళ్లి చేసుకున్నాననీ పదే పదే విమర్శించేవాడు. నేను సామాన్యంగా ఉండే మధ్యతరగతి అమ్మాయిని. మాది పెద్దలు కుదిర్చిన పెళ్లే! వేరే అమ్మాయిలతో పోల్చి ఆధునికంగా లేననీ, సంపాదన ఎక్కువ లేదనీ అనేవాడు. వేరు కాపురం పెట్టి, మాకిద్దరికీ విడిగా ఇల్లు తీసుకుంటే... మా ఆడపడుచు వాళ్ళు కూడా వచ్చారు. పోనీ వాళ్ళతో కలసిమెలసి ఉంటే బాగుంటాడేమో అనుకుంటే, అదీ అడియాసే అయింది. ఇక మా మధ్య ఏకాంతం అనే మాటే లేదు. మా అత్తగారు వాళ్ళు ఎప్పుడూ అక్కడే! ఒక్కరోజు కూడా మేమిద్దరం ఎవరూ లేకుండా లేము. ఆ పరిస్థితుల్లోనే పాప పుట్టింది. నామకరణం రోజున పెద్ద గొడవ అయింది. అతను కోరుకున్న భార్య లక్షణాలు కనీసం అయిదు చూపాలని నాతో నీచంగా మాట్లాడాడు. దాంతో కోపం వచ్చి, వెళ్లిపొమ్మన్నాను. ఇప్పటికి ఏడు నెలలైంది. నేను ఉద్యోగం లేకుండా అమ్మానాన్నలపైనే ఆధారపడి ఉన్నా. పెద్దవాళ్ళు కలగజేసుకొని మాట్లాడినా, సమస్య పరిష్కారం కాలేదు. వాళ్ళ షరతుల ప్రకారం నేను వాళ్ళడిగినవన్నీ ఇచ్చి, మా ఆడపడుచు ఇంటికి (బ్రిటన్) వెళ్ళడానికీ, పనిచేయడానికీ ఒప్పుకుంటే నన్ను కాపురానికి రానిస్తారట! నాకు ఏం చెయ్యాలో తోచడం లేదు. కొంతమంది కేసు పెట్టమంటున్నారు. కానీ, పాప గురించి ఆలోచిస్తున్నాను. *ఏం చేస్తే బాగుంటుందో సూచించండి!*

**- అంజలి**



చదువుకున్నంత మాత్రాన సంస్కారం ఉండదనడానికి మీ భర్త లాంటివారు ఉదాహరణ. మీ పట్ల అతని ప్రవర్తన ఏ మాత్రం క్షమార్హం కాదు. ముందే మీరు ఖండించి ఉండాల్సింది. బహుశా, కొత్తకాపురంలో కుదురుకునే ప్రయత్నంలో మీరు అవన్నీ భరించి ఉంటారు. కానీ అంత తరచుగా అతను అవమానిస్తూ ఉంటే... పెద్దవాళ్ళతో మాట్లాడి అయినా మొదట్లోనే తేల్చుకోవాల్సింది. అన్నాళ్లు భరించిన మీరు అందరి ముందూ తట్టుకోలేకపోవడమూ సమర్థనీయమే! ఒక రకంగా అతనికి కావలసిందే మీరు చేశారు. ఎలాగో అలా వదిలించుకుంటే చాలనుకునే అతగాడికి కన్నకూతురి పైన మాత్రం ప్రేమ ఉంటుందా? మీ చదువు, తెలివితేటలు మీకంటూ ఒక ఉద్యోగం సంపాదించి పెట్టకపోవు. మీ జీవితాన్ని మీకు నచ్చినట్టు మలచుకోవడమా, లేక మళ్ళీ రాజీపడి అవమానాలకు గురి కావడమా అనేది మీ చేతుల్లోనే ఉంది. ఏ కాస్తయినా అభిమానం, ఆదరణ చూపని భర్తను భరించాలంటూ బహుశా మీ అమ్మానాన్నలు కూడా మీకు చెప్పరు. కాబట్టి, ఇప్పటికైనా ధైర్యంగా మీ భర్తతో తాను మీతో ఎలా ఉండాలో కూడా చెప్పండి! తప్పు తెలుసుకుంటే మారతాడు. లేదంటే మీ భవిష్యత్తు కోసం తగిన చర్యలు తీసుకోండి.

**- కె.శోభ,** ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్, shobhas292@gmail.com